నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | VIKARABAD


## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడి గర్హనీయం

### మాజీ ఎమ్మెల్యే ఆనంద్



వికారాబాద్, సెప్టెంబర్ 12 : కాంగ్రెస్ గూండాలు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై రాళ్లు, కోడి గుడ్లతో దాడి చేయడాన్ని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అంటూ మండిపడ్డారు.. ఎమ్మెల్యే గాంధీని, అతడి అనుచరులను కౌశిక్ రెడ్డి ఇంటిపైకి పంపించి కౌశిక్‌రెడ్డిని మాత్రం హౌస్ అరెస్ట్ చే యడం ఏమిటని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిపైకి కాంగ్రెస్ గూండాలు వెళ్లడం.. గేట్లు, గోడ దూకి మరీ దాడికి పాల్పడడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, దాడి చేసిన గాంధీని, అతడి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## విలీనంపై హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : శంషాబాద్ మండలంలోని ఘాన్సీమియాగూడ పంచాయతీని శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనంపై ప్రభుత్వానికి గురువారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పంచాయతీని విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ అమలును నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. ఘన్సీమియాగూడ పంచాయతీని శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఈనెల 2న జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ అదే పంచాయతీకి చెందిన టి.సిద్ధయ్య మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస రావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. విలీనం ద్వారా ప్రతి పనికీ శంషాబాద్ వెళ్లాల్సి వస్తుందని, అంతేగాకుండా పన్నుల భారం పడుతుందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేయడం ద్వారా మెరుగైన వసతులు ఏర్పడతాయని వ్యాఖ్యానించింది. కౌంటర్లు దాఖలు చేయాలంటూ ప్రతివాదులైన సాధారణ పరిపాలన పురపాలక, పంచాయతీ శాఖల ముఖ్యకార్యదర్శులు, రంగారెడ్డి కలెక్టర్, శంషాబాద్ మున్సిపాలిటీలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 26కు వాయిదా వేసింది.

# కాంగ్రెస్ కుట్రలపై బీఆర్‌ఎస్ పిడికిలి

### సత్తాచూపిన కొత్తపేట

### ప్రజాప్రతినిధులు, నేతలకు అడుగడుగునా మద్దతుగా నిలిచిన రంగారెడ్డి జిల్లా శ్రేణులు




కొత్తపేట దగ్గర పోలీస్ వాహనాన్ని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు





కేశంపేట పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళన

రంగారెడ్డి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడిచేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద బైఠాయించిన ఎమ్మెల్యేలను అరెస్టు చేసిన సందర్భంలో పోలీసులు హైడ్రామా నడిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను అరెస్టు చేసిన పోలీసులు గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో రెండు వాహనాల్లో నేతలను తీసుకెళ్లారు. అయితే బీఆర్‌ఎస్ నేతలను శ్రీశైలం హైవే మీదుగా తీసుకెళ్తున్నట్లు సమాచారం తెలియడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు పెద్ద ఎత్తున రోడ్లపైకి తరలివచ్చారు. అడుగడుగునా పోలీస్ వాహనాలను అడ్డుకున్నారు. కడ్తాల్ మండలంలోని రావిచెడు గ్రామం వద్ద పోలీస్ వాహనాన్ని అడ్డుకున్నారు. పోలీసులు వాహనాలను ఆపకుండా ముందుకు వెళ్లడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు పోలీస్ వాహనాలను వెంబడించాయి. తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు అటువైపుగా వెళ్తున్న పోలీస్ వాహనాలను స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. రోడ్డుకు అడ్డంగా నిలబడి పోలీసుల వాహనాన్ని అడ్డుకోగా..అడ్డంకుల మధ్య ఒక వాహనాన్ని తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు ఉన్న మరో వాహనాన్ని షాద్ నగర్ వైపుగా మళ్లించారు. ఈ క్రమంలో కేశంపేట మండలం కొత్తపేట వద్ద రోడ్డుపై టైర్లను అడ్డంగా పెట్టి పోలీసు వాహనాన్ని కార్యకర్తలు అడ్డుకున్నారు. ఉద్రిక్తతల మధ్యనే కేశంపేట పోలీస్ స్టేషన్‌కు హరీశ్‌రావు, ఇతర నేతలను పోలీసులు తరలించారు. పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కు తరలిరావడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసుల వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పోలీసులు బీఆర్‌ఎస్ శ్రేణులపై లాఠీచార్జి చేశారు. పరిస్థితి మరింత ఉద్రిక్తతకు దారితీయగా మరోసారి పోలీసులు లాఠీచార్జి జరిపి ఆందోళన కారులను చెల్లాచెదురు చేశారు. దాదాపు రెండు గంటల పాటు హరీశ్‌రావుతో పాటు ఇతర నేతలు పోలీస్ వాహనాల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. చివరకు పోలీసులు మాజీ మంత్రి హరీష్‌రావు, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్‌లను కేశంపేట పోలీస్ స్టేషన్ లోపలికి తరలించారు.

### తలకొండపల్లి పీఎస్ నుంచి ఎమ్మెల్యేలు విడుదల..

తలకొండపల్లి పీఎస్‌కు తరలించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గురువారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు విడుదల చేశారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. విడుదలైన ఎమ్మెల్యేలు వివేకానంద, బండారి లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ స్పీకర్ మధుసూదనాచారిలు సొంత వాహనాల్లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మదుసూదనాచారి మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితిని తాను ఎన్నడూ చూడలేదన్నారు. రెండు గంటలపాటు పోలీసులు అటూ.. ఇటూ తిప్పడమేమిటని ప్రశ్నించారు. ఈ రెండు చోట్లా జిల్లాలోని బీఆర్‌ఎస్ శ్రేణులు పోలీసులను అడ్డుకొని మరోసారి ఉద్యమ స్ఫూర్తిని చాటారు. ఎప్పటికప్పుడు పెద్దసంఖ్యలో తరలివస్తున్న శ్రేణులను చూసి ఒకదశలో పోలీసులు బెంబేలెత్తారు. నాడు తెలంగాణ ఉద్యమంలో చూపిన తెగువను మరోసారి జిల్లా శ్రేణులు చూపడంతో పోలీసులు వెనుకంజ వేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు బీఆర్‌ఎస్ ప్రజప్రతినిధులు, అగ్రనేతలను విడుదల చేయాల్సిన పరిస్థితి కల్పించారు. కేశంపేటలో అర్ధరాత్రి వరకు శ్రేణుల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.

# అవిశ్వాసంపై బలపరీక్ష నేడే



### క్యాంపుల నుంచి నేరుగా కార్యాలయానికి..

### ఆర్డీవో పర్యవేక్షణలో 11 గంటలకు సమావేశం

### పెద్దఅంబర్‌పేట చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 17 మంది..

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 12: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం బలపరీక్ష జరగనున్నది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై అవిశ్వాస తీర్మానం కోరుతూ గతనెల పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసిన విషయం తెలిసిందే. అప్పట్లోనే తమకు పూర్తి మెజారిటీ ఉన్నదని 17 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన పత్రాలను కూడా అందజేశారు. చైర్‌పర్సన్ రేసులో ఉన్న పండుగల జయశ్రీ తమవర్గం 17 మంది కౌన్సిలర్లతో క్యాంపులకు తరలివెళ్లారు. వారు క్యాంపుల నుంచి నేరుగా ఉదయమే బలపరీక్ష నిర్వహించే తట్టిఅన్నారంలోని మున్సిపల్ వార్డు కార్యాలయానికి చేరుకోనున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో పర్యవేక్షణలో 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. మున్సిపల్ పాలకవర్గానికి మరో నాలుగు నెలలే ఉండగా, చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడం ఆసక్తిగా మారింది. ఇప్పటికే ప్రస్తుత చైర్‌పర్సన్ స్వప్నను రాజీనామా చేయించి స్వచ్ఛందంగా తప్పించాలని పార్టీ పెద్దలు ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ఫలించలేదు. గతంలోనే అవిశ్వాసానికి ప్రయత్నించినా వారికి మెజారిటీ లేదని, అవిశ్వాసం మీద బలపరీక్షపై స్టే విధించాలని చైర్‌పర్సన్ వర్గీయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలుస్తున్నది. పార్టీ పెద్దల సూచనతో రాజీనామా చేయాలని తొలుత భావించినప్పటికీ కోర్టు తీర్పు తర్వాత నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

### గతం నుంచే ప్రయత్నాలు..

మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులు ఉన్నాయి. పాలకవర్గం ఏర్పడినప్పుడు 13 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, 8 మంది బీఆర్‌ఎస్ నుంచి, బీజేపీ, సీపీఐ నుంచి ఒక్కొక్కరు చొప్పున స్వతంత్ర అభ్యర్థి ఒకరు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు రెండుగా విడిపోవడంతో ఓ వర్గం మద్దతుతో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన స్వప్నను చైర్‌పర్సన్ పదవి వరించింది. అయితే, దాదాపు మూడేండ్ల నుంచి చైర్‌పర్సన్ తీరుపై బీఆర్‌ఎస్‌తోపాటు కాంగ్రెస్‌లోని ఓ వర్గం కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. గత ఏడాది చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. కానీ మెజారిటీ లేకపోవడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్ స్వప్నతోపాటు మరో ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 17కు పెరిగింది. కానీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లే బీఆర్‌ఎస్, ఇతర అభ్యర్థుల మద్దతుతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. బలపరీక్షలో కోరానికి అనుగుణంగా 17 మంది సభ్యుల మద్దతు ఉన్నదని చైర్‌పర్సన్ బరిలో ఉన్న పండుగల జయశ్రీ దీమాతో ఉన్నారు. పాలకవర్గం గడువు మరో నాలుగునెలలే ఉన్నప్పటికీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ముందుకుసాగడం చర్చనీయాంశంగా మారింది. సమయంతో పనిలేకుండా ఏది ఏమైనా పంథం నెగ్గించుకుంటామని ఓ వర్గం కౌన్సిలర్లు స్పష్టం చేస్తున్నారు.

# ‘విజిలెన్స్ విభాగం’పై కమిషనర్ కన్నెర్ర

### హైడ్రాలో పనిచేస్తుండటంపై ఆగ్రహం

### ఈనెల జీతాలు ఇవ్వొద్దంటూ..

### ఫైనాన్స్ విభాగానికి ఆదేశాలు

### ‘నమస్తే తెలంగాణ’ కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో రిపోర్ట్ చేసి విధులు నిర్వహించాల్సిన విజిలెన్స్ విభాగంలోని కొందరు అధికారులు హైడ్రాలో పనిచేస్తుండటంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్దియాకు సంబంధించిన రోజువారీ కార్యక్రమాలు, అంతర్గత విచారణల నివేదిక రూపకల్పనలో విజిలెన్స్ అధికారుల అవసరం ఉన్నప్పటికీ బాధ్యతలు మరిచి హైడ్రాలో కొంతకాలంగా పోలీసు శాఖ నుంచి వచ్చిన డిప్యుటేషన్ అధికారులు పని చేస్తున్నారు . ఈ విషయాన్ని రెండురోజుల కిందట ‘నమస్తే’ జీహెచ్‌ఎంసీలో పత్తాలేని విజిలెన్స్ విభాగం శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ మేరకు కమిషనర్ ఆమ్రపాలి విజిలెన్స్ అధికారులపై సీరియస్‌గా స్పందించారు. గురువారం బల్దియాలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించారు. జీహెచ్‌ఎంసీలో పనిచేయాల్సిన కొందరు విజిలెన్స్ విభాగపు అధికారులు హైడ్రాలో పనిచేస్తున్నట్లు అదనపు కమిషనర్ నళినీ పద్మావతి కమిషనర్‌కు వివరించారు. అంతేకాకుండా హైడ్రాలో పనిచేస్తున్న వారందరినీ రిలీవ్ చేసి.. జీహెచ్‌ఎంసీకి వెనక్కు పంపాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అదనపు కమిషనర్ లేఖ రాసినట్లు కూడా కమిషనర్‌కు తెలిపారు. ఈ పరిణామాలపై కమిషనర్ ఆమ్రపాలి విజిలెన్స్ విభాగం అధికారుల వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైడ్రాలో పనిచేస్తున్న బల్దియా విజిలెన్స్ అధికారులకు ఈనెల జీతాలు నిలిపివేయాలంటూ బల్దియా ఫైనాన్స్ విభాగానికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

# అర్ధరాత్రి డ్రోన్ల కలకలం

### యాచారం, మంచాల మండలాల్లో సంచారం

### భయాందోళనలో ప్రజలు

యాచారం/మంచాల, సెప్టెంబర్ 12 : అర్ధరాత్రి సమయంలో ఆకాశంలో డ్రోన్లు సంచరించడం యాచారం, మంచాల మండలాల్లో తీవ్ర కలకలం రేపుతున్నది. యా చారం మండలంలోని చింతపట్ల, మొండిగౌరెల్లి గ్రామాల్లో గత నాలుగు రోజులుగా ప్రతిరోజూ ఐదారు డ్రోన్లు ఆకాశంలో సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి మొండిగౌరెల్లి, చింతపట్ల గ్రామాల్లో.. బుధవారం రాత్రి చింతపట్లలో వరుసగా నాలుగు నుంచి ఏడు డ్రోన్లు గాల్లో తిరగడాన్ని గ్రామస్తులు గమనించి.. తమ సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. అదేవిధంగా మం చాల మండలంలోని చీదేడు, రంగాపూర్, జాపాల, మంచాల, కాగజ్‌ఘట్ గ్రామాలపై బుధవారం రాత్రి 9 నుంచి సుమారు 11 గంటల వరకు ఆరు డ్రోన్లు గ్రామా ల్లోని బిల్డింగ్‌లకు అతి సమీపం నుంచి తిరిగినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. పోలీసులు, అధికారుల అనుమతుల్లేకుండా డ్రోన్లు ఎందుకు గ్రామాల్లో అర్ధరాత్రి సమయంలో తిరుగుతున్నాయని.. వాటిని ఎవరు, ఎక్కడి నుంచి ఎందుకోసం ఎగురేస్తున్నారని గ్రామాల ప్రజల ఒక్కసారిగా ఆలోచనలో పడ్డారు. పైగా అర్ధరాత్రి ఆకాశంలో పంటపొలాలు, గొర్రెలు, మేకల మందలు ఉన్న చోటే డ్రోన్లు గంటల తరబడి తిరుగుతుండడంతో పలు అనుమానాలకు తావిస్తున్నది. రాత్రిపూట గ్రామాల్లో డ్రోన్లు సంచరించడంతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. చింతపట్ల గ్రామం లో ఇటీవల బోరుమోటరు, గొర్రెలు, గొర్రె పొట్టేలు, మేకలు, ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు చోరీకి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఇలా గ్రామంలో వరుసగా చోరీలు చోటుచేసుకుంటున్న తరుణంలో అర్ధరాత్రి సమయంలో డ్రోన్లు తిరుగుతుండడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. గ్రామంలోని పంట పొలాల వద్ద ఉన్న విలువైన వస్తువులు, గొర్రెలు, మేకలను అపహరించుకుపోయేందుకు దుండగులు డ్రోన్ల సహాయంతో ఆరా తీస్తున్నట్లు పలువురు భావిస్తున్నారు. ఎవరైనా ఏదైనా ఉపద్రవాన్ని సృష్టించేందుకేనా..? అని భయపడుతున్నారు. గ్రామాల్లో అనుమతుల్లేకుండా డ్రోన్లు తిరుగుతుండడంపై పోలీసులు దృష్టి సారించారు. మొం డిగౌరెల్లి, చింతపట్ల గ్రామాల్లో డ్రోన్ల కదలికలపై నిఘా పెట్టారు. స్థానికులూ డ్రోన్ల రహస్యాన్ని గుర్తించేందుకు గ్రామాల్లో జాగారం చేస్తున్నారు. పోలీసులు డ్రోన్లను అనుసరించగా అవి మొండిగౌరెల్లి నుంచి నేరుగా మంచాల మండలంలోని దాద్‌పల్లి గుట్టల ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. తాజాగా మండలంలోని మేడిపల్లిలో ..మంచాల మండలంలోని రంగాపూర్‌లో డ్రోన్ల కదలికలు ఉన్నట్లు ఆయా గ్రామాలవాసులు పేర్కొన్నారు. రోజుకో గ్రామంలో డ్రోన్ల సంచారం కలకలం రేపుతున్నది. మొండిగౌరెల్లి, చింతపట్ల, మేడిపల్లి గ్రామాల్లో ప్రత్యేక నిఘాపెట్టినట్లు యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐలు శంకర్‌కుమార్, నరసింహారావు తెలిపారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.



చింతపట్లలో అర్ధరాత్రి ఆకాశంలో తిరుగుతున్న డ్రోన్

## జంట జలాశయాల గేట్లు మూసివేత

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లను అధికారులు గురువారం మూసి వేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టి రెండు రిజర్వాయర్లకు వరద ప్రవాహం తగ్గడంతో వాటి గేట్లను మూసేశారు. కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో జంట జలాశయాలకు భారీగా వరద ప్రవాహం వచ్చింది. ఈ నెల 7వ తేదీన సాయంత్రం 5 గంటలకు హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ ఒక గేటును, ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను ఒక్క అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. తాజాగా వర్షాలు తగ్గడంతో గేట్లను పూర్తి స్థాయిలో మూసివేసినట్లు అధికారులు తెలిపారు.